సాక్షి
తిరుపతి

బుధవారం । 4 । డిసెంబర్ । 2024




ఆలయంలో ఆగని లీకేజీలు

భారీ వర్షాలతో శ్రీకాళ హస్తీశ్వరాలయ పైకప్పు నుంచి లీకేజీ అవుతోంది. తడుస్తూనే భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. - 8లో



నింగికేగేందుకు సిద్ధంగా పీఎస్ఎల్వీ సీ59



ప్రోబా-3 ఉపగ్రహం



ప్రత్యేక వాహనంలో ప్రయోగవేదిక వద్దకు వెళుతున్న రాకెట్‌లోని మొదటి విభాగం



రాకెట్ శిఖరభాగంలో హీట్‌షీల్డ్‌ను క్లోజ్ చేస్తున్న దృశ్యం



మూడో దశను రాకెట్ పైభాగంలో ఏర్పాటు చేస్తూ..



స్ట్రాపాన్ బూస్టర్లు అమరుస్తూ..

హుషార్‌గా అనుసంధానం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) పీఎస్ఎల్వీ సీ59 రాకెట్ ప్రయోగానికి సన్నద్ధమైంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన 550 కేజీల ప్రోబా-03 శాటిలైట్‌ను కక్ష్యలోకి పంపించేందుకు మంగళవారం కౌంట్‌డౌన్ ప్రారంభించింది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లనున్న ఉపగ్రహ వాహక నౌకను పకడ్బందీగా అనుసంధానం చేసింది. - సూళ్లూరుపేట

న్యూస్‌రీల్

'యోగవాసిష్టం' బహూకరణ



గ్రంథం అందుకుంటున్న వీసీ దంపతులు

తిరుపతి సిటీ : తెలుగులోకి అనువదించిన యోగ వాసిష్టం గ్రంథాన్ని మంగళవారం జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తికి వ్యాసాశ్రమం ప్రతినిధులు బహుకరించారు. వారు మాట్లాడుతూ గ్రంథం అనువదించడంలో వర్సిటీ అధ్యాపకులు, వేద విద్యార్థులు సహకరించారని వెల్లడించారు. మహత్కార్యానికి మార్గ నిర్దేశం చేసిన వీసీకి అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డీన్ లలితారాణి, అధ్యాపకులు పీటీజీ రంగరామానుజాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

సత్యవేడు : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను మంగళవారం అభినందించారు.. గుంటూరు జిల్లా వెనికొండ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన రగ్బీ టోర్నీలో సత్యవేడు విద్యార్థులు డి. మునీంద్ర, డి.హేమంత్, అబ్దుల్ హమీద్ సత్తా చాటారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయిని భారతి, పీడీ మురళీ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు పాండురంగయ్య, సూర్యకుమార్, కార్తిక్, రాజేష్, మనోహర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 03 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 58,607 మంది స్వామివారిని దర్శించుకోగా 19,841 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.61కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.



కొట్టుకుపోయిన పాపానాయుడుపేట - చెన్నంపల్లె రోడ్డు

భద్రం.. రోడ్లు ఛిద్రం

అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారులు ఫెంగల్ తుపాను ధాటికి పూర్తిగా దెబ్బతిన్నాయి. పట్టణాలు.. పల్లెలు అనే తేడా లేకుండా రోడ్లు ఛిద్రమయ్యాయి. ఎక్కడికక్కడ గుంతలు పడి బురదమయంగా తయారయ్యాయి. రాకపోకలు సాగించాలంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. అయితే అధికారులు మాత్రం నష్టాలపై ప్రతిపాదనలు పంపించేందుకే పరిమితమవుతున్నారు. ప్రభుత్వం నుంచి మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో చేతులెత్తేస్తున్నారు.

ఫెంగల్ తుపానుతో దెబ్బతిన్న రహదారులు

- దుస్థితిలో గ్రామీణ మార్గాలు
- రాకపోకలకు తప్పని ఇక్కట్లు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న అధికారులు
- మరమ్మతులకు మంజూరు కాని నిధులు

తిరుపతి అర్బన్ : ఫెంగల్ తుపానుతో జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో రోడ్లు ధ్వంసమయ్యాయి. 20 నిమిషాల ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో వాహనంలో కంటే కాలినడకన వెళ్లడం ఉత్తమంగా భావించే దుస్థితి దాపురించింది. ప్రధానం గా గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు సైకిల్‌పై పాఠశాలకు వెళ్లడానికి నానా తిప్పలు పడుతున్నారు.

ధ్వంసమైన రహదారులు

- శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు, రేణిగుంట, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు మండలాల పరిధిలో భారీగా రోడ్లు ధ్వంసమయ్యాయి. రేణిగుంట ఫ్లైఓవర్ వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో నో పార్కింగ్ బోర్డు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. అలాగే రేణిగుంట పాత చెక్ పోస్ట్ ప్రాంతంలోని కెనరా బ్యాంక్ వద్ద గుంతలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఏర్పేడు మండలంలో అనేక గ్రామాలకు వెళ్లే మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాపానాయుడుపేట-చెన్నంపల్లె మార్గంలో స్వర్ణముఖినది, నక్కలవంక వాగు ఉధృతికి సిమెంట్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- గూడూరు నియోజకవర్గంలో అమ్మవారిపాడెం-మేఘనూరు మార్గంలో రోడ్లు నాశనమయ్యాయి. అలాగే ఓడూరు, సున్నపువారిపాళెం, నెలబల్లె, రెట్టపల్లెకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. కోట మండలానికి చేరుకునే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. చిల్లకూరు మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు, గురగల్ల దిబ్బ మార్గంలోనూ రోడ్లు అధ్వానంగా మారాయి.
- వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం-పాదలకూరు రోడ్డు దెబ్బతింది. అలాగే తోస్సంటూరు- మునగలపాళెం రోడ్డు దుస్థితికి చేరుకుంది. బాలాయపల్లె మండలంలో కిలిమిళిగంట, సముద్రవారికండ్రిగ, జయంపు, హస్తకావేరి, కామకూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. డక్కిలి మండలంలో వెలికిల్లి, వీకేవై సముద్రం, ఆల్తూరుపాడు, అత్తల సిద్ధవరం, రేగడిపల్లె రోడ్లు ధ్వంసమయ్యాయి. వెంకటగిరి నుంచి పాత్లెంకోట, పారోలు, సిద్ధవరం మార్గాల్లో ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది.
- తిరుపతిలోని కొరమేనుగుంట, పూలవానిగుంట, గొల్లవానిగుంట, ఎమ్మార్‌పల్లె రహదారులు గుంతలమయంగా మారాయి. మంగళం, తిరుమలనగర్‌లోని కేవీఆర్ నగర్ రోడ్డు దెబ్బతింది. తిరుపతి రూరల్‌లోని గొల్లపల్లె, చిగురువాడ, రామానుజపల్లె రోడ్లు ధ్వంసమయ్యాయి.
- సత్యవేడు నియోజకవర్గంలో ద్వారకానగర్, అరిగిచేలు, పూడి సీకేపురం కాజీవేలు దెబ్బతిన్నాయి. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. అలాగే నాగలాపురం, పిచ్చాటూరు మండలంలో అడవికొడియంబేడు, పారూరు రోడ్లు అధ్వానంగా మారాయి.
- సూళ్లూరుపేట నుంచి కోట మార్గంలో వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. మంగళంపాడు రోడ్డు దెబ్బతింది. తడ మండలం అండగుండాల, మాంబట్టు రోడ్డు ధ్వంసమైంది.



గూడూరు మండలం పురిటిపాళెం రోడ్డు దుస్థితి

గుంతలే గుంతలు



వరదయ్యపాళెం నుంచి మా గ్రామానికి వెళ్లు రోడ్డు అడుగు పెట్టేందుకు కూడా వీలు లేకుండా తయారైంది. ఎటు చూసినా గుంతలే గుంతలు. ముఖ్యంగా రాత్రి వేళ రాకపోకలు సాగించాలంటే భయపడే పరిస్థితి. ఇది సేద్యం చేసుకునే సమయం కావడంతో నిత్యం ఎరువుల కోసం ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తిరుగుతుంటాం. ప్రాణాలు పిడికిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతులు చేయించాలి. – దుద్దు వేణు, సీఎల్ఎస్ పల్లె, వరదయ్యపాళెం మండలం

భారీగానే దెబ్బతిన్నాయి



తిరుపతి, శ్రీకాళహస్తి డివిజన్ల పరిధిలో తక్షణం గుంతలను పూడ్చడానికి రూ.2 కోట్లు నిధులు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపించాం. సూళ్లూరుపేట, గూడూరు డివిజన్ పరిధిలో లెక్కలు కట్టాల్సి ఉంది. మొత్తంగా ఆర్అండ్‌బీ రోడ్లు తుపాన్‌తో భారీగానే దెబ్బతిన్నాయి. నూతనంగా రోడ్లు వేసేందుకు రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు మరో వారం పట్టవచ్చు. – మధుసూదన్‌రావు, ఆర్అండ్‌బీ విభాగం జిల్లా అధికారి

అంచనా వేస్తున్నాం



తుపాను ప్రభావంతో గ్రామీణ రోడ్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. నష్టాన్ని అంచనా వేస్తున్నాం. తక్షణం రూ.31 లక్షల అవసరం ఉందని సర్కార్‌కు ప్రతిపాదనలు పంపించాం .డివిజన్ల వారీగా లెక్కలు కట్టాలని చెప్పాం. ఆ మేరకు పంచాయతీరాజ్ విభాగానికి చెందిన అధికారులు రోడ్లను పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం సేకరించడానికి సమయం పడుతుంది. ఆ మేరకు పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. – రామ్మోహన్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధికారి



గుంతలమయంగా కోట ప్రధాన రహదారి



చిల్లకూరు మండలం చింతవరం అంబేద్కర్ సెంటర్ వద్ద రోడ్డుపై గుంత



పెళ్లకూరు : పూర్తిగా దెబ్బతిన్న పునబాక- చెంబేడు రహదారి



సూళ్లూరుపేటలో దారుణంగా తయారైన రోడ్డు

అవినీతి పుట్ట పగులుతోంది!

- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న తనిఖీలు
- కదులుతున్న రిజిస్ట్రేషన్ అక్రమాల డొంక
- విచారణలో గోప్యత పాటిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న అడిషనల్ ఐజీ ఉదయభాస్కర్ రావు



తనిఖీల్లో నిమగ్నమైన సిబ్బంది

రేణిగుంట : రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి పుట్ట పగులుతోంది. ఉన్నతాధికారుల తనిఖీల్లో అక్రమాల బాగోతం బయటపడుతోంది. గత ఐదు నెలలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై భారీగా ఫిర్యాదులు రావటంతో రాష్ట్ర స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ అడిషనల్ ఐజీ ఉదయ భాస్కర్ రావు, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీరామ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ముమ్మరంగా తనిఖీలు ప్రారంభించారు. మంగళవారం కూడా తనిఖీ ప్రక్రియ కొనసాగింది. అన్ని రిజిస్ట్రేషన్లు నిలిపివేసి ఇతరులు ఎవరినీ కార్యాలయంలోకి అనుమతించకుండా క్షుణ్ణంగా ప్రతి ఫైల్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించేసుకున్న బడా నేతలలో వణుకు మొదలైనట్లు సమాచారం.

ప్రత్యేక బృందంతో..

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. గత 5 నెలలుగా జరిగిన రిజిస్ట్రేషన్లు క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఇందు కోసం అనుభవజ్ఞులైన పది మంది సిబ్బందిని పిలిపించుకున్నట్లు తెలిసింది. తనిఖీల్లో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం . నిషేధిత జాబితాలోని భూమిని అక్రమించుకున్న వ్యక్తి పక్క సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు అన్నీ గిఫ్ట్ డీడ్ కింద జరిగినట్లు తెలిసింది. గిఫ్ట్ డీడ్‌లను గ్రామకంఠం భూములకు మాత్రమే చేస్తారని అధికారి వెల్లడించారు.

దర్యాప్తు కొనసాగుతోంది

అడిషనల్ ఐజీ ఉదయభాస్కర్ రావు మాట్లాడుతూ రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టామన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎక్కువగా నిషేధిత భూములను రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ముఖ్యంగా తిరుపతి అర్బన్ మండల పరిధిలోని మంగళంలో ఉన్న ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు వెల్లడవుతోంది. ఈ సర్వేనంబర్‌లోని భూమి ఎక్కువ శాతం నిషేధిత జాబితాలో ఉంది. అయితే ఈ భూమికి మంచి డిమాండ్ ఉండటంతో కొందరు అక్రమార్కులు దృష్టి సారించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులతో కలిసి ఆయా భూములను కాజేసినట్లు సమాచారం. ప్రధానంగా మంగళం పరిధిలోని భూములకు సంబంధించే అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

త్వరితగతిన భూసేకరణ

తిరుపతి అర్బన్ : జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు. గడువు లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. హైవే అథారిటీ అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని తెలిపారు. కడప-రేణిగుంట, తిరుపతి-మదనపల్లె , రేణిగుంట-నాయుడుపేట 6 లేన్ నిర్మాణం, తిరుపతి బైపాస్ 6 లేన్, రేణిగుంట- చెన్నై వరకు 4 లేన్ రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. అలాగే కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట-తూర్పు కనుపూరు 6 లేన్ల రహదారి, చిల్లకూరు క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు 4 లేన్ల రహదారి, తూర్పు కనుపూరు నుంచి కృష్ణపట్నం పోర్ట్ సౌత్ గేట్ వరకు 6 లేన్ల రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్ట్ భూ సేకరణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

క్లుప్తంగా

ముక్కంటి ఆలయంలో ఆగని లీకేజీలు



ఆలయంలో ఉరుస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయం ఉరుస్తోంది. ఫెంగల్ తుపాను కారణంగా ఐదు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో ఆలయం పైకప్పు నుంచి నీరు లీకేజీ అవుతోంది. గతంలో చేపట్టిన నివారణ చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. ప్రస్తుతం ఓ దాత స్వయంగా ముందుకు వచ్చి సహజ పద్ధతుల్లో ఇటుకలు, సున్నం, మూలికల కలిపిన మిశ్రమంతో లీకేజీలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. స్వామి అమ్మవార్ల సన్నిధిలో లీకేజీలు ఎక్కువగా ఉండడంతో భక్తులు తడుస్తూనే దర్శనం చేసుకోవాల్సి వస్తోంది. అలాగే ఉప ఆలయాలు కూడా ఉరుస్తున్నాయి. ప్రధాన ఆలయం పనులను ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని దాత తెలిపారు.

శ్రీకాళహస్తికి 'చాగంటి' శిష్యబృందం

శ్రీకాళహస్తి: ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు శిష్య బృందం ఈనెల 14, 15వ తేదీల్లో శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేస్తున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. 14న వెయ్యి లింగాల కోనలోని సహస్ర లింగేశ్వరుని దర్శించుకుంటారని, 15న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేయనున్నట్లు వివరించారు.

8న సాగునీటి సంఘాల ఎన్నికలు



మాట్లాడుతున్న చందారెడ్డి సురేష్

రామచంద్రాపురం : మండలంలోని 12 చెరువులకు ఈ నెల 8వ తేదీ సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చందారెడ్డి సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. రాయలచెరువు, అనుప్పల్లె చెరువు, కుప్పంబాదూరు చెరువు, కోడి చెరువు, పుల్లాట్ల వాగు చెరువు, పిల్లారికోన చెరువు, అన్నె చెరువు, బొప్పరాజుపల్లె చెరువు, సంగటిముద్దల కోన చెరువు, గుండాలవంక చెరువు, అన్నస్వామి గండి చెరువు, తీట్రకొన చెరువులకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిరమ్మ, తహసీల్దార్ వెంకటరమణ, ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎత్తిరాజులు పాల్గొన్నారు.



స్వర్ణరథంపై ఊరేగుతున్న అమ్మవారు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో పద్మావతీదేవి

సౌభాగ్య సౌరభం

- సర్వభూపాల వాహనంపై సిరులతల్లి విహారం
- స్వర్ణరథంపై అమ్మవారి విలాసం
- గరుడుని అధిరోహించి పద్మావతి రాజసం

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారు కాళీయమర్ధనుడి అలంకారంలో సర్వభూపాల వాహనంపై కొలువుదీరారు. అశేష భక్తుల నీరాజనాల నడుమ మాడవీధుల్లో ఊరేగారు. సాయంత్రం దివ్యతేజోవిరాజితమైన స్వర్ణరథంపై సౌభాగ్యలక్ష్మిగా ఆశీనులై తిరువీధుల్లో విహరించారు. వజ్రాభరణాలు ధరించి భక్తులను అనుగ్రహించారు. రాత్రి మహిమాన్విత గరుడ వాహనంపై సిరులతల్లి కొలువుదీరారు. మంగళవాయిద్యాలు, గోవిందనామ స్మరణలు, కళాకారుల ప్రదర్శనల నడుమ అత్యంత వైభవంగా ఊరేగారు. కార్యక్రమాల్లో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఎస్‌ఈ జగదీశ్వర్‌రెడ్డి, అర్చకుడు బాబుస్వామి పాల్గొన్నారు.

పంచమి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల చివరిరోజైన శుక్రవారం పంచమి తీర్థానికి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని పద్మ సరోవరం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు స్తామని తెలిపారు. పంచమితీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో పుణ్యస్నానాలు ఆచరించాలని కోరారు.



గరుడవాహనంపై శ్రీవారి దేవేరి



సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న అలమేలు మంగమ్మ

'ప్లస్'తో బాలికా విద్య పటిష్టం

తిరుపతి ఎడ్యుకేషన్ : హైస్కూల్ ప్లస్‌తో బాలికా విద్య పటిష్టమవుతుందని ఏపీ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ స్పష్టం చేశారు. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటుచేసి అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌ను పారితోషికంగా అందించి ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సక్రమంగా ఆలోచించాలని, హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించాలని, ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సహకరించాలని కోరారు. వంద మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌కు అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.

'ముంతాజ్' నిర్మాణంపై ఆందోళన



నిరసనకారులతో మాట్లాడుతున్న తుడా సెక్రటరీ

తిరుపతి తుడా : శ్రీవారి పాదాల చెంత జూపార్క్ రోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్ పనులను తక్షణం నిలిపివేయించాలని హిందూ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం తుడా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. హోటల్ నిర్మాణానికి టీటీడీ బోర్డు అడ్డు చెప్పినా పనులను ఆగడం లేదని మండిపడ్డారు. తుడా సెక్రటరీ వెంకటనారాయణ మాట్లాడుతూ హోటల్ నిర్మాణానికి కేవలం దరఖాస్తు చేసుకున్నారని, ఎలాంటి అనుమతుల ఇవ్వలేదని స్పష్టం చేశారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అసంబద్ధం

- ఎస్‌ఎల్‌టీఏ విమర్శ

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల సన్నద్ధానికి పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పూర్తిగా అసంబద్ధం, అశాస్త్రీయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్‌ఎల్‌టీఏ) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్‌కుమార్ ఓ సంయుక్త ప్రకటనలో విమర్శించారు. రెండో శనివారం, ఆదివారాల్లోనూ పాఠశాలలు పని చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించడం తగదని ఆక్షేపించారు. ఇప్పటికీ పదో తరగతి సిలబస్ పూర్తి కాలేదని, మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం సన్నాహంలో ఉపాధ్యాయులు నిమగ్నమై ఉన్నారని పేర్కొన్నారు. సంక్రాంతి సెలవు దినాలను మూడు రోజులకు కుదించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు దాదాపు 9గంటల పాటు విద్యార్థులు తరగతి గదిలో గడుపుతుండడంతో మానసిక ఒత్తిడికి లోనవుతారని, దీనికి తోడు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికతో విద్యార్థులు మరింత ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం ఉందని, ఈ ప్రణాళికను పాఠశాల విద్యాశాఖ నిలుపుదల చేయాలని, సెలవు దినాలు, పండుగ సెలవులను యదావిధిగా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

మఠం ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



మఠం భూమిలో ప్రహరీ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్: స్వామి హథీరాంజీ మఠం ఆస్తులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆ మఠం పరిపాలనాధికారి కేఎస్.రామారావు హెచ్చరించారు. మంగళవారం ఎయిర్ బైపాస్ రోడ్డులోని సర్వే నంబర్ 266/30-ఏలో ఉన్న స్వామి హథీరాంజీ మఠానికి చెందిన ఏడు సెంట్ల భూమి పరిరక్షించుకునేందుకు మఠం అధికారులు మంగళవారం ఆ భూమిలో ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ భూమికి పక్కనున్న భవనానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి అనే వ్యక్తి.. తన భవనానికి దారి కావాలని మఠం సిబ్బందిని అడ్డుకున్నారు. దీనిపై మఠం పరిపాలనాధికారి స్పందిస్తూ, మఠం ఆస్తులను ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

టీచర్ బదిలీపై విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడులో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు సుమన్ బదిలీపై విద్యార్థులు నిరసన తెలిపారు. మంగళవారం ఈ మేరకు పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాకు దిగారు. ఉత్తమంగా పాఠ్యాంశాలు బోధించే టీచర్‌ను బదిలీ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో బదిలీ చేస్తే తమ చదువుపై ప్రభావం పడుతుందని వెల్లడించారు. ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపడతామని విద్యార్థులకు నచ్చజెప్పారు. ఈ క్రమంలోనే పీఓ పరిమళ, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు విచారణ చేపట్టారు.


అభివృద్ధే లక్ష్యంగా పోరాటం



మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

తిరుపతి కల్చరల్ : జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని ఆరోపించారు. జిల్లావాసుల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టీటీడీ నిధులు వెచ్చించాలని కోరారు. దేవదాయశాఖ ఆదాయంతో పీహెచ్‌సీలు నిర్మించాలని సూచించారు. ఉపాధి పనులను పకడ్బందీగా అందించాలని కోరారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాల విక్రయాలను ఉక్కుపాదంలో అణిచివేయాలని స్పష్టం చేశారు. రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించాలని తెలిపారు. సమావేశంలో సీపీఎం నేతలు కందారపు మురళి, ఆర్.లక్ష్మి, పి.సాయిలక్ష్మి, టి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విషజ్వరంతో వ్యక్తి మృతి



మృతి చెందిన శివయ్య

వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడులో శివయ్య(48) అనే వ్యక్తి విషజ్వరంతో మృతి చెందాడు. ఓ పరిశ్రమలో కూలీగా పని చేస్తున్న శివయ్యకు వారం క్రితం జ్వరం వచ్చింది. చికిత్స తీసుకుంటున్నా తగ్గలేదు. ఈ క్రమంలో మంగళవారం పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు చిన్నపాండూరు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యం చేస్తుండగానే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దళిత ప్రొఫెసర్‌పై దాడికి నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషమని విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరు వర్సిటీలో తరగతులను బహిష్కరించి పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అన్యమత ప్రచారం చేస్తున్నారనే నెపంతో భజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమన్నారు.

రైళ్లలో కర్పూరం వెలిగిస్తే మూడేళ్లు జైలు..!

- తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ హెచ్చరిక



కుప్పాల సత్యనారాయణ, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్

తిరుపతి అర్బన్: రైళ్ల ప్రయాణంలో కర్పూరం వెలిగిస్తే మూడేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, రైళ్లలో ప్రయాణం చేస్తూ ఇటీవల కర్పూరం వెలిగించడంతోపాటు హారతి ఇవ్వడం, అగరబత్తులు, సాంబ్రాణి పుల్లలు వెలిగించడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఇలాంటి చర్యలు అగ్ని ప్రమాదాలకు దారితీసి ప్రాణాలతోపాటు రైల్వే ఆస్తులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే రైల్వే చట్టం-1989లోని సెక్షన్లు 67, 154, 164, 165 ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడతాయని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం శబరిమలైకు ప్రత్యేక రైళ్లను నడుపుతోందని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడ, నాందేడ్, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి అధికంగా అయ్యప్ప భక్తులు బయలుదేరుతున్నారని చెప్పారు. అయితే పలుచోట్ల రైళ్లలోనే కర్పూరం వెలిగిస్తున్నారని, భద్రత దృష్ట్యా వీటిని నిరోధించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, కమర్షియల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది విస్తృతమైన తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అయ్యప్పస్వామి భక్తులతోపాటు ఇతర భక్తులు, ప్రయాణికులు ప్రశాంతంగా రైళ్లలో ప్రయాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడల్లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకుల ప్రతిభ



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని అంతర్ కళాశాలల డిగ్రీ అధ్యాపకులకు నిర్వహించిన పలు క్రీడా పోటీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో విజేతగాను, డబుల్స్ విభాగంలో ముస్తాక్ అహ్మద్, డి.ప్రభాకర్ రన్నర్స్‌గా, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో డాక్టర్ కిరణ్ కుమార్ రాజు విజేతగా నిలిచారు. అలాగే మహిళా అధ్యాపకులు డాక్టర్ ఎం.వాణి, శిల్ప, మహితారాణి, డాక్టర్ పూర్ణిమ, బి.శ్రీదేవి త్రోబాల్ పోటీల్లో విజేతలుగా గెలుపొందారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరుడు, భీమన్న తదితరులు అధ్యాపకులను అభినందించారు.

త్వరలోనే స్విమ్స్‌లో బ్లాక్ చైన్ సెంటర్

తిరుపతి తుడా : స్విమ్స్‌లో పేషెంట్ హెల్త్ కేర్ లక్ష్యంగా అప్‌లెడ్జ్ బ్లాక్ చైన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ రామ్, డీన్ అల్లాడి మోహన్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ మేరకు హైదరాబాదుకు చెందిన బ్లాక్ చైన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఐడీఎస్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు వెల్లడించారు. దీనిపై సంస్థ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఒరుగంటి అరవింద్, డాక్టర్ ఉషాకళావత్, కె.మాధవి, డాక్టర్లు శ్రీహరిరావు, నందగోపాల్, నెట్‌వర్క్ ఇంజినీర్ ప్రణయ్‌తేజ పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు

తిరుమల: ఇటీవల కర్ణాటకలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ లాన్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో టీటీడీ నిఘా, భద్రతా అధికారులు సత్తా చాటారు. టీటీడీ వీజీఓలు రామ్‌కుమార్, సురేంద్ర పతకాలు సాధించారు. నవంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు బెంగళూరులోని కర్ణాటక స్టేట్ లాన్ టెన్నిస్ స్టేడియంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ 25వ అఖిల భారత పోలీస్ లాన్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2024 ను నిర్వహించింది. ఈ పోటీల్లో సీఐఎస్‌ఎఫ్, సీఆర్పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ, ఎన్‌ఎస్జీ సహా మొత్తం 20 రాష్ట్ర పోలీసు బృందాలు, పారామిలటరీ బలగాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో టీటీడీ వీజీఓ రామ్‌కుమార్ వెటరన్ డబుల్స్‌లో రజత పతకం, వీజీఓ ఎ.సురేంద్ర ఓపెన్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రజత పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో వారిని మంగళవారం టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అభినందించారు. అలాగే తిరుమలలో అడిషనల్ ఈఓ సీహెచ్. వెంకయ్య చౌదరి కూడా వారిని అభినందించారు.

సెల్ఫ్ సెంటర్లకు అనుమతులు ఎలా ఇస్తారు..?

తిరుపతి సిటీ: వర్సిటీ అధికారుల నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. గతం కంటే 20 పరీక్ష కేంద్రాలను తగ్గించిన అధికారులు, తమ అనుచరవర్గంగా ముద్రపడిన కళాశాలలకు ప్రాధాన్యత నిస్తూ ఆ కేంద్రాలను పక్షపాత వైఖరితో కేటాయించారనే విమర్శలొస్తున్నాయి. దీనికి తోడు అధికారులు మరో వివాదాస్పద నిర్ణయానికి తెరదీశారు. కొన్ని ప్రైవేటు కళాశాల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు వసతులు లేని కళాశాలలకు సెల్ఫ్ సెంటర్లను కేటాయించారు. వర్సిటీ నిబంధనల ప్రకారం ఒక కళాశాలలో చదివిన విద్యార్థులకు అదే కళాశాలలో కాకుండా సమీపంలోని మరో కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించాలి. కానీ అధికారులు దీనికి విరుద్ధంగా నియమ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థులు తాము చదివిన కళాశాలలోనే పరీక్షలు రాసే విధంగా సెల్ఫ్ సెంటర్లకు అనుమతులివ్వడం చర్చనీయాంశమైంది. అలాగే జవాబు బుక్‌లెట్స్‌న సరఫరా చేయడంపై విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

ఎస్వీయూ పరిధిలోని అన్ని పభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలలలో బుధవారం నుంచి డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు అన్ని పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు పూర్తి చేసినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 64 పరీక్ష కేంద్రాలలో సుమారు 10వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

వాగు దాటుతూ ఇద్దరు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరొకరి కోసం గాలింపు



ఘటనా స్థలంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాం సమీపంలో మంగళవారం తాగేడు వాగును బైక్‌పై దాటుతూ ఇద్దరు వ్యక్తుల గల్లంతయ్యారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా కథనం మేరకు.. కోట మండలం జరుగుమల్లికి చెందిన వేణుంబాక మధురెడ్డి(47) మల్లాంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ షాపులోనే జార్ఖండ్‌కు చెందిన షారూఖ్(22) అనే యువకుడు పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ బైక్‌పై కోట నుంచి దుకాణానికి బయలుదేరారు. మార్గం మధ్యలో తాగేడు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినప్పటికీ వారు బైక్‌లో వాగు దాటేందుకు యత్నించగా అదుపు తప్పి పడిపోయారు. ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ చినబలరామయ్య సిబ్బందితో కలిసి గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అడిషినల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ రమణకుమార్ సైతం అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే మధురెడ్డి మృతదేహం మాత్రం లభించింది. బుధవారం ఉదయం షారూఖ్ కోసం గాలింపు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో పడి మత్స్యకారుడి మృతి



ఆర్ముగం(ఫైల్)

నాగలాపురం: అరణియార్ ప్రాజెక్టు మధ్య తూము కాలువలో పడి ఆర్ముగం (57) అనే మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాలు.. మంగళవారం వేకువ జామున 5 గంటలకు ఆర్ముగం ద్విచక్ర వాహనంపై అరణియార్ జలాశయానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కాలువ సిమెంట్ గట్టుకి ఆర్ముగం తల తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అరణియార్ మత్స్యకారుల సంఘం నేతలు కోరారు.

'గంగ' అక్విడెట్‌కు రంధ్రం



అక్విడెట్ పైభాగంలో పడిన రంధ్రం

వరదయ్యపాళెం: మండలంలోని సిద్ధాపురం సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాలువ అక్విడెట్‌కు రంధ్రం పడింది. తుపాను కారణంగా భారీ వర్షాలకు ఎగువ భాగం కొండల నుంచి వచ్చిన వరదకు లోపల మట్టి కోతకు గురై రంధ్రం పడినట్లు రైతులు వెల్లడిస్తున్నారు. దీన్ని వెంటనే పూడ్చకపోతే ప్రధాన కాలువకు గండి పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. గండి పడితే పంట పొలాలతోపాటు కాపకండ్రిగ, అంబికాపురం గ్రామాలు ముంపునకు గురవుతాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

శ్రీసిటీకి 'బెలారస్' ప్రతినిధులు



శ్రీసిటీలో బెలారస్ ప్రతినిధుల బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): బెలారస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. డయానా తురువా నేతృత్వంలో 14 మంది విచ్చేయగా శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను వివరించారు. మౌలిక వసతులు, పర్యావరణ వ్యవస్థ, ఇతర కార్యకలాపాలు ప్రతినిధులు వీక్షించారు. వైటల్ పేపర్ పరిశ్రమను సందర్శించి కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. భారత్, బెలారస్ దేశాల నడుమ వ్యాపార బంధం బలపడుతుందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

కొంత తీరిన వేతన వెతలు

తిరుపతి తుడా: తిరుపతి రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికుల వేతన వెతలు ఎట్టకేలకు తీరాయి. రుయా సిబ్బందికి నాలుగు నెలలు, ప్రసూతి ఆస్పత్రి కార్మికులకు ఐదు నెలలుగా బకాయి పడిన జీతాల్లో రెండు నెలల మొత్తాన్ని కాంట్రాక్ట్ సంస్థ మంగళవారం చెల్లించింది. కార్మికులు నాలుగురోజులపాటు ఆందోళనకు దిగడంతో ఇప్పటికి కొంత ఉపశమనం లభించింది.అయితే మూడేళ్లుగా చెల్లించని పీఎఫ్ సొమ్ము, మిగిలిన వేతన బకాయిలను పది రోజుల్లో చెల్లిస్తామని సంస్థ హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా కార్మిక సంఘం నేత మహేంద్ర మాట్లాడుతూ పది రోజుల్లో పూర్తి చెల్లించకుంటే ఆందోళన తప్పదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

దొరవారిసత్రం/పెళ్లకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆయన పోలీస్‌స్టేషన్‌లో వివిధ రికార్డుల నిర్వహణతో పాటు పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం వివిధ కేసుల గురించి స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రాత్రి పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌ను కూడా ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.

నారుమడులపై జాగ్రత్త వహించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

సైదాపురం: నారుమడులపై రైతులు జాగ్రత్త వహించాలని ఏఓ హైమావతి సూచించారు. కమ్మవారిపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తుపాను తగ్గుముఖం పట్టాక నారుమడులు, వరినాట్లు వేసుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రాయితీపై ఎరువుల పంపిణీ



ఎరువులు అందిస్తున్న అధికారులు

చిల్లకూరు: రాయితీపై రైతులకు ఎరువులు అందిస్తున్నామని మండల వ్యవసాయధికారిణి గూడూరు భవాని అన్నారు. మంగళవారం మండలంలోని కడివేడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పలువురు రైతులు గతంలో కియోస్కి ద్వారా బుక్ చేసుకున్న వారికి డీఏపీ ఎరువును రాయితీపై అందిస్తున్నామన్నారు. వ్యవసాయ సహాయకులు సరిత, మాజీ సర్పంచ్ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వర్ల కొండయ్య

కలువాయి: కలువాయికి చెందిన వర్ల విశ్వనాథ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. విశ్వనాథ్ జయంతిని పురస్కరించుకుని ట్రస్ట్ కార్యాలయంలో దుప్పట్లు పంపిణీ చేసి, అనంతరం పేదలకు అన్నదానం చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ వర్ల కొండయ్య తెలిపారు. ట్రస్ట్ సభ్యులు వర్ల మల్లికార్జున్, ప్రసాద్, సురేష్ నాయుడు, వెంకటయ్య, చెంచయ్య, సుభాన్, ఖాజా, బాబు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు కట్టడి చేయాలి

కోట: గూడలిలో ఎక్కడ చూసినా మద్యం బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. గూడలిలో సంగమేశ్వరాలయం, గూడలి కొండపై భీమేశ్వరాలయం ఉన్నాయి. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత వాతావరణం ఉండే గూడలికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. బెల్టుషాపులతో జనం ఇబ్బందులు పడుతున్నారు. షాపుల మధ్య పోటీ పెరగడంతో కష్టమర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు బెల్టుషాపుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మగ్గం బతుకులు కుదేలు

- 10 రోజులుగా పనులు లేని చేనేతలు
- బూజుపట్టి పోతున్న నూలు, జరీ
- కడుపు కొట్టిన ఫెంగల్ తుపాను





మగ్గం గుంతలో నీటిని తోడి పోస్తున్న నేతన్న, (ఇన్‌సెట్) బూజుతో నూలును చుట్టేసిన మగ్గం

చిల్లకూరు: వ్యవసాయం తరువాత చేనేత రంగం అతి పెద్దది, అలాంటి చేనేత రంగంపై కూటమి ప్రభుత్వం అంతంత మాత్రంగానే దృష్టి పెట్టడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు నియోజకవర్గంలో కోట, చెన్నూరు, నెలబల్లిరెట్టపల్లి, విందూరు, గూడూరు ప్రాంతాల్లో 500 కుటుంబాల వరకు చేనేత పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో కుటుంబంలోని వారు ఇద్దరు, ముగ్గురు వరకు పనిచేస్తేనే వారికి పూట గడుస్తుంది. అలాంటి వారికి గతంలో సొంత మగ్గం ఉన్న వారికి అప్పటి ప్రభుత్వం రూ.24 వేల వరకు ఏడాదికి అందించేది. అయితే ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం చేనేతలను ఆదుకుని వారికి అండగా నిలవడమే కాకుండా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీలు ఇచ్చారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా కనీసం వారికి ఏమి ఇవ్వాలనే విషయాలను కూడా పట్టించుకోకపోవడంతో చేనేతలు అల్లాడిపోతున్నారు. అలాంటి చేనేతపై గత పది రోజులుగా ఫెంగల్ తుపాను ప్రభావంతో వర్షాలు పగపట్టినట్లు కురుస్తూనే ఉన్నాయి. వర్షం రైతులకు మేలు చేస్తున్నాయే తప్ప చేనేతలకు నష్టాల చేకూరుస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోరున వర్షం కురుస్తుండడంతో నూలు వడకడం, కండి చుట్టడం, నూలు అతకడం, సాపు పట్టడం, చీర నేయడం లాంటి పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో చేనేత కుటుంబాలలోని వారు పస్తులతో కాలం గడపాల్సి వస్తుంది. వర్షం దెబ్బకు మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నీరు పూర్తిగా ఇంకిపోయి ఆరిన తరువాత కానీ గుంతల్లోకి దిగి నేత నేసే వీలుండదు. దీనికి తోడు మగ్గంపై వేసిన నూలు, జరీ బూజుపట్టి పనికి రాకుండా పోతున్నాయి. దీంతో నూలు, జరీ ఇచ్చిన షావుకారుకు బకాయి పడాల్సి వస్తుంది. నూలు, జరీ తీసుకుని వచ్చిన సమయంలో పది రోజుల్లో సాపు (చీరలు) పూర్తిచేసి అందిస్తామని తెచ్చిన నూలు, నేడు బూజుపట్టడంతో చీరలు నేయలేని స్థితి నెలకొంది. ఇలాంటి సమయంలోనైనా చేనేతకు తగిన పరిహారం అందించి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మిన్నకుండి పోతుండడంతో తమకు కష్టాలు తప్పడం లేదని వారు అంటున్నారు.



మగ్గం మీద వేసిన నూలు, జరీకి పట్టిన బూజును శుభ్రం చేస్తున్న చేనేత కార్మికుడు

పది రోజులుగా పనుల్లేవు



పెద్ద వర్షం కురవడంతో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో నీటిని ఎత్తి బయట పోసుకుని నేసేందుకు దిగదామనుకుంటే పాదాలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు శరీరంలోకి నెమ్ము చేరి జబ్బు పడాల్సి వస్తుంది. దీంతో పనులు చేయలేకపోతున్నాం. గత పది రోజులుగా పనులు లేక అల్లాడిపోతున్నాం. ప్రభుత్వం నేత కార్మికులను ఆదుకోవాలి

–రమాదేవి, చేనేత కార్మికురాలు, నెలబల్లిరెట్టపల్లి, చిల్లకూరు మండలం

ఉచిత విద్యుత్ ఇవ్వాలి



సొంత మగ్గాలు ఉన్న వారికి గతంలో ప్రభుత్వం ఏడాదికి ఒకసారి నగదు అందించి సాయం చేసేది. అయితే నేడు అది అందడం లేదు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. దానిని అమలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలి. పనులు లేకుండా ఉన్న చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి.

–కనక లింగేశ్వరరావు, నేత కార్మికుడు, నెలబల్లిరెట్టపల్లి, చిల్లకూరు మండలం

వర్షాలు పడితే ఇదే తంతు



గుంత మగ్గాలు ఉన్న ప్రతి ఒక్క చేనేత కార్మికులు వర్షాలు వచ్చిన ప్రతిసారి ఇలా ఇబ్బంది పడాలి. గుంత మగ్గాలు కాకుండా స్టాండ్ మగ్గాలు ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలి. చేనేతలో పనిచేసే మహిళా కార్మికులకు ప్రత్యేకంగా పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వర్షంతో దెబ్బ తిన్న వారికి ప్రభుత్వం సాయం అందించాలి.

–యశోదమ్మ, చేనేత కార్మికురాలు, నెలబల్లిరెట్టపల్లి, చిల్లకూరు మండలం

గుంతల్లో నీటిని పరిశీలిస్తున్నాం..

వర్షాల కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరిందని చేనేత కార్మికులు సమాచారం ఇవ్వడంతో గూడూరు నియోజకవర్గంలోని చెన్నూరు క్లస్టర్ పరిధిలో పరిశీలించి నేత కార్మికులతో మాట్లాడాను. అన్ని ప్రాంతాల్లోని నేతన్నలతో మాట్లాడి వివరాలను ప్రభుత్వానికి పంపిస్తాం

–ఉమామహేశ్వరరావు, చేనేత జౌళిశాఖాధికారి, తిరుపతి జిల్లా

ముమ్మరంగా క్లోరినేషన్ పనులు

సైదాపురం: మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ముమ్మరంగా క్లోరినేషన్ పనులు చేశారు. బస్టాండ్ నుంచి పోలీసు స్టేషన్ వరకు, అలాగే వీధుల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా బ్లీచింగ్ పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శశిఇంద్రాన్ని తెలిపారు. సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ శివకుమార్ పాల్గొన్నారు.

పంటల బీమా చేసుకోండి



బీమాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

కలువాయి: రైతులు తాము సాగు చేసే వరి, మినుము, పచ్చిశనగ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ రైతులకు సూచించారు. మాదన్నగారిపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నెలాఖరు వరకు పంట నమోదు చేస్తారని ఆయన వివరించారు. పప్పు దినుసులు సాగు చేసే వారు ఈనెల 15లోగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

కండలేరులో 54.280 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 54.280 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 2,050 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 2,150 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..







కోట: విద్యార్థులకు సాయం అందిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్, డీవీ సత్రం: మాట్లాడుతున్న ఎంఈఓ, వెంకటగిరి: మాట్లాడుతున్న ఎంఈఓ

కోట: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ పిలుపునిచ్చారు. భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్జి భరత్‌కమల్ హాజరై దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అయన మాట్లాడుతూ దివ్యాంగుల కోసం భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానసిక ఎదుగుదలకు భవిత కేంద్రాలు సాయపడతాయన్నారు. ఎంఈఓ శైలజ, ఎంఈఓ–2 మస్తానయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మండలంలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నెలబల్లి పాఠశాల పూర్వపు విద్యార్థి డాక్టర్ రాజేంద్రప్రసాద్, అరుణజ్యోతి దంపతుల సౌజన్యంతో దివ్యాంగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. ఎంఈఓ కృష్ణయ్య, భవిత సెంటర్ టీచర్స్ వరలక్ష్మి, స్రవంతి, హెచ్‌ఎం రామయ్య పాల్గొన్నారు.

మనోధైర్యంతో రాణించాలి

వెంకటగిరిరూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు మనోధైర్యంతో జీవితంలో రాణించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఏంఈఓ పంపిణీ చేశారు. ఎంఈఓ–2 బాబయ్య, రోటరి చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ బీకే ప్రసాద్, సెక్రటరీ జానకిరామ్, సభ్యులు వెంకటశేషయ్య, మాధవి పాల్గొన్నారు.





రాపూరు: బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ, చిల్లకూరు: విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న టీచర్లు

రాపూరులో..

రాపూరు: స్థానిక హిందూ ప్రాథమిక పాఠశాల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎంపీడీఓ భవాని, ఎంఈఓ శ్రీనివాసులు, సిబ్బంది చంద్రశేఖర్, కరుణాకర్, సహిత విద్యా ఉపాధ్యాయులు ప్రసన్న పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులైన పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం సుదాకర్, ఉపాధ్యాయులు మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, చంద్ర, వీవీ కుమార్, శ్రీనివాసులు సురేంద్ర, విద్యా కమిటీ చైర్‌పర్సన్ షకీలా పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరురూరల్: పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం దివ్యాంగులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, ఫల సరుకులు పంపిణీ చేశారు. సీనియర్ రొటేరియన్ దాత ఎల్లసిరి గోపాల్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నాసిన నాగులు, శ్రీకంఠి రామోహన్‌రావు, చోళవరం గిరిబాబు, బండి ధనుంజయరెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.



గూడూరు: ఫలసరుకులు పంపిణీ చేస్తున్న గోపాల్‌రెడ్డి

మనో ధైర్యం ఇవ్వాలి

దివ్యాంగులను తక్కువగా చూడకుండా వారికి మనో ధైర్యం ఇస్తే వారు అనుకున్న విజయాలను సాధించగలుగుతారని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్‌కే షరీనా అన్నారు. పట్టణంలోని షాదీ మంజిల్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రీహ్యాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబుల్డ్ (రెడ్) సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గైడైర్ రైల్వే కమర్షియల్ సూపరింటెండెంట్ ఆరేటి వెంకటేశ్వర్లు, రెడ్‌సంస్థ గౌరవ అధ్యక్షుడు మనపాటి రవీంద్ర, ఏపీజీబీ కోఆర్డినేటర్ గురుస్వామి, మయూరి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

వెంకటగిరిరూరల్: పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. మండలంలోని సీసీ కండ్రిగ, పారవోలు గ్రామల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుజాత, శాస్త్రవేత్త ఈకే నాయక్, ఉద్యానశాఖ అధికారి ఆనంద్, పశువైద్యాధికారి కిషోర్, ఏఈఓ రామ్మోహన్, వీఏలు శివకుమార్, నీరజాదేవి పాల్గొన్నారు.

బాలాయపల్లిలో...

మండలంలోని పిగిలాం గ్రామంలో వ్యవసాయశాఖ అధికారిణి శిరీష ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలు సాగుచేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏడీఏ

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

కోట: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఎన్నికల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జయజయరావు మాట్లాడుతూ సాగునీటి సంఘాలకు సంబంధించి 5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మేజర్, మైనర్ చెరువుల కింద 22 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం చేశామని తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో దండోరా వేసి ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. ఎంపీడీఓ వేణు, ఇరిగేషన్ ఏఈ మునిరాజా పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రమీలారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీలకు సంబంధించి 19 సాగునీటి సంఘాలు ఉన్నాయని, వీటిలో 15 మైనర్, 4 మీడియం ఇరిగేషన్ చెరువులకు ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భూయాజమాన్య హక్కు కలిగిన ఆయకట్టు రైతులను ఓటర్లుగా నమోదు చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: మండలంలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధంగా ఉండాలని మండల అధికారులు వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులు, అన్ని శాఖల మండల అధికారులకు శిక్షణ ఇచ్చారు. మండల పరిధిలో 27 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు వెల్లడించారు. తహసీల్దార్ రాజేంద్ర, సీడీపీఓ ఉమామహేశ్వరి, ఏఓ గణేష్, ఆర్‌బ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో..

సైబర్ క్రైమ్‌పై అవగాహన

కలువాయి: ప్రజలు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్‌క్రైమ్‌పై అవగాహన పెంచుకోవాలని ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నౌరోజ్, కార్యదర్శి షేక్ అహ్మద్ పిలుపునిచ్చారు. నూకనపల్లి కమ్యూనిటీ భవనంలో మంగళవారం రిజర్వు బ్యాంకు వారి సౌజన్యంతో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సంఘ బంధం అధ్యక్షులు పోలమ్మ, రహంతుల్లా పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న మహిళలు